


# కాదేదీ సృష్టికనర్హం

శనివారం రాత్రి సుమారు ఎనిమిది గంటలయింది. విజయవాడ రైల్వే స్టేషన్‌కి మంగళరావు చేరుకుని పది నిముషాలయిపోయింది.

చుట్ట తాగుతూ మంగళరావు ఎదురుగా ఆగివున్న హౌరా–మద్రాస్ మెయిల్ వంక చూస్తూ ఆలోచిస్తున్నాడు దీర్ఘంగా—అతి దీర్ఘంగా.

తను తాగే ఆఖరి చుట్ట అది అవాలా, కాదా అని. తను ఇంకా బ్రతికే ఉండాలా లేక చచ్చిపోవాలా అని. మంగళరావుకి తను బ్రతికివుండటంవల్ల కలిగే ఉపయోగం ఏమీ కనిపించటంలేదు.

త నుబ్రతికే వుంటే, అందరిముందూ తిరుగుతూంటే, తనకి లభించేది సుఖం కాదు, అశాంతి. దుఃఖం. తీవ్రమయిన మనస్తాపం.

అలా అనవసరంగా అందరిచేతా

చిన్నచూపు చూడబడటానికి, అవమానింపబడటానికి తనంతట తానుగా ఎటువంటి తప్పూ చేయలేదు. తనని పుట్టించిన భగవంతుడిదే ఆ తప్పంతా. తనకి జన్మ ఇచ్చే తరుణంలో బహుశ బ్రహ్మదేముడి మనస్సు బావుండివుండదు. అందుకే తనని గురించి అట్టే పట్టించుకోకుండా ఈ భూమ్మీదికి తోసేసాడు.

చుట్టని తాగుతూ ఎదురుగా కంపార్ట్‌మెంటులోని కిటికీ ముందు కూర్చున్న దంపతులిద్దరివంకా చూసాడు మంగళరావు. ఆ ఇద్దరినీ చూస్తూంటేనే ఎలాంటి వాళ్ళకయినా అసూయ కలగక మానదు.

అందులో తనకి కలగడంలో ఆశ్చర్యం వుండనే వుండదు ముప్పై అయిదేళ్ళుంటాయి ఆ అబ్బాయికి. అందంగా, ఆరోగ్యంగా, ఖరీదయిన బట్టల్లో హుందాగా వున్నాడతను.

పాతిక వుండచ్చు ఆ బంగారు బొమ్మకి. నిజమే. సరిగ్గా అనుకున్నాడు తను. బంగారుబొమ్మే నిజంగా. బంగారం రంగు వొళ్ళు ఆ అమ్మాయికి. కోల మొహం. నల్లటి కళ్ళు. గుండ్రటి కళ్లు. కళ్ళలో వజ్రాలున్నాయని భ్రమ కలిగేలా మెరిసే నల్లటికళ్ళు. టమోటాపండు రంగులో వున్న తడి పెదవుల జంట వెనక తళుక్కుమనే పళ్ళు చిరునవ్వుకు తార్కాణం

నిజంగా ఫస్ట్‌క్లాస్‌లో ప్రయాణం చేయాల్సినంత అందం ఆ అమ్మాయి సొత్తు. అభర్త్రప్రాప్తం. ఆజంటఅదృష్టం.

మంగళరావు ఆలోచనలలోకి మళ్ళీ బ్రహ్మదేవుడు ప్రవేశించాడు. ఆ అమ్మాయిని బ్రహ్మదేవుడు ప్రత్యేకశ్రద్ధతో తయారుచేసాడు. తన దగ్గరున్న బంగారు మట్టినంతా ఆ అమ్మాయి దేహంకోసం ఉపయోగించి, సరస్వతి, నారదుల అభిప్రాయాలడిగి, నగిషీలు చెక్కి, చిరునవ్వుకి కూడా అందాలు తొడిగి, ప్రాణం ఇచ్చివుంటాడు.

మంగళరావు చుట్ట విసిరేసాడు ఆఖరిసారిగా దమ్ములాగి. ఓ నిశ్చయానికి వచ్చేసాడు గంట కొడుతూండగా. సందేహంలేదు. ఇదే ఆఖరిచుట్ట. ఇదే ఆఖరి రోజు. ఇదే ఆఖరి అయిదు నిముషాలు తన జీవితంలో. ఇక తను బ్రతకడు. బ్రతికి వుండలేడు.

చటుక్కున ప్లాట్‌ఫారం అంచుకు నడిచాడు. హౌరా-మద్రాస్ ఎక్స్‌ప్రెస్ ఇంజను గంభీరంగా అరిచింది, బయల్దేరుతున్నా నన్నట్లుగా. ప్రయాణీకులు పెట్టెల్లోకి ఎక్కుతున్నారు. గార్డ్ విజిల్ వూది, పచ్చజెండా వూపుతున్నాడు.

మంగళరావు క్షణం ఆలస్యం చేయలేదు. ప్లాట్‌ఫారానికీ, రైలుపెట్టెకీ మధ్య వున్న ఖాళీస్థలంలోంచి, రైలు పెట్టె కిందకి దిగాడు. రెండు చక్రాల మధ్యనుంచి, రైలుపట్టాల మధ్యవున్న తూములాంటి దానిలోకి దిగాడు. తూములో నుంచుని, నడుము వంచి

వీపుని రైలుపట్టాలమీద ఆనించాడు ప్లాట్‌ఫారం వైపు. కళ్ళు మూసుకున్నాడు. వూపిరి బిగబట్టాడు. మనసులోనే క్షణాలు లెక్కబెట్టసాగాడు.

రైలు కదులుతుందనుకున్నాడు. తన మీదనుంచి ఆ కంపార్ట్‌మెంట్ చక్రం వెళ్తుందనుకున్నాడు. తన జీవితం కునిసిందనుకున్నాడు.

అరుపులు కేకలు. రైలు కదలలేదు. ఇందాక రైల్లో, కిటికీ ప్రక్కన కూర్చుని వున్న ఆ బంగారుబొమ్మ భర్త కంపార్ట్‌మెంట్ దిగి, ఆ కంపార్ట్‌మెంట్ కింద వున్న మంగళరావుని చెయ్యిపట్టుకుని, కోపంగా అరుస్తూ పైకి లాగసాగాడు.

చాలామంది గుమిగూడారు. సాయంపట్టారు. మంగళరావుని పైకి లాగారు. రైల్వేగార్డు, ఇంజన్ డ్రయివర్ వచ్చి చెడామడా తిట్టారు మంగళరావుని.

"నీ పేరు?" అడిగాడు అతను.

"మంగళరావు" హీనస్వరంతో చెప్పాడు మంగళరావు.

"ఎందుకిలా చేశావ్?" అడిగాడు రైల్వేపోలీస్.

"దుర్భరమయిన జీవితం కొనసాగించటం ఇష్టంలేక."

"ఇది చట్టవిరుద్ధం'' కఠినంగా అన్నాడు గార్డ్.

"కావచ్చు."

ఆ బంగారుబొమ్మ భర్త తదేకంగా చూస్తూండిపోయాడు మంగళరావువంక ఆశ్చర్యంగా.

"నా వెంట రా" రైల్వే పోలీస్ మంగళరావు చెయ్యి పట్టుకున్నాడు.

ఆ బంగారుబొమ్మ భర్త మంగళరావు కొద్దిదూరం పోలీస్ వెంట వెనక నడిచాక కదిలాడు. మంగళరావు దగ్గరకి వెళ్ళాడు గబగబా. జేబులోంచి తన విజిటింగ్ కార్డు తీసి, మంగళరావు జేబులో వుంచుతూ అన్నాడు:

"శిక్ష పూర్తయ్యాక ఓసారి ఈ అడ్రసుకు రా. కొత్తజీవితం అక్కడ నీకు లభిస్తుంది. నీ కక్కడా బావుండక పోతే నీ ఇష్టం వచ్చినట్లు చేద్దువుగాని. కాని మరోసారి ఆత్మహత్యకి ప్రయత్నించే ముందు నాకు కనబడటం మర్చిపోకు.''

"ఎందుకు?" విస్మయంగా అడిగాడు మంగళరావు. "నాలాంటి వాడితో మీకు పనేముంటుంది? దుర్బలుడిని."

"నీకే తెలుస్తుందిగా."

మంగళరావు వెనక్కి తిరిగి చూస్తూ నడిచాడు పోలీస్‌ల వెంట.

రైలు అయిదు నిముషాల తర్వాత కదులుతుండగా అడిగింది బంగారుబొమ్మ తన భర్తని.

"ఎవరతను? ఏం మాట్లాడారు?"

జవాబు చెప్పలేదు భర్త. అసలు తన భార్య వంక చూడనయినా చూడలేదు.

*    *    *

జైల్లో వుండగా మంగళరావు ఆలోచించాడు చాలాసార్లు. కాని ఆ ఆగంతకుని ఆహ్వానంలోని అంతరార్థం బోధ

పడలేదు. కలకత్తా వెళ్ళి అతన్ని కలిసే దాకా.

కలిసాడు తొమ్మిది నెలల తర్వాత తనని చూడగానే గుర్తుపట్టాడు. గూర్ఖాతో ముందరే చెప్పివుంచినట్లున్నాడు. ఆల్సేషన్ కుక్క తననేం చేయకుండా డ్రాయింగ్ రూమ్‌దాకా తీసుకెళ్లాడు తనని గూర్ఖా. తను రాబోయే ముందు వుత్తరం రాయడం మంచిదయింది అనుకున్నాడు మంగళరావు.

"నీకు ఇంటిపనీ, వంటా వచ్చా?" అడిగాడు బంగారుబొమ్మ భర్త మంగళరావుని.

బదులుగా తలవూపి చెప్పాడు మంగళరావు.

"చాలాకాలం హోటల్‌లో పనిచేసాను."

"వెరీగుడ్. ఇప్పటినుంచే పనిలో చేరు. జీతం బాగానే ముడుతుంది."

"నేనా? నాకు పనిఇస్తున్నారా?" అని నవ్వి మళ్ళా చెప్పాడు." నాఅంతట నేనే పనిచేస్తానని ఇంతవరకు ఎంత మందిని అడిగినా ఎవరూ పని ఇవ్వలేదు మీరు ధర్మాత్ములులా వున్నారు."

"ధర్మాత్ముడ్నికాదు. అయినా పని ఇస్తున్నాను." మృదువుగా నవ్వి చెప్పాడు అతను.

"నామీద జాలా?" అడగకూడదనుకుంటూనే అడిగాడు మంగళరావు.

"కాదు. నా స్వార్థం."

ఆ సాయంత్రం డైనింగ్ రూమ్‌లో కూర్చుని టిఫిన్ తింటూన్న బంగారు బొమ్మకి బోర్నవిటా కలుపుతూ, 'దగ్గర నుంచి చూస్తే ఎంత బావుంది' అనుకోకుండా వుండలేకపోయాడు.

బాత్‌రూమ్ అద్దం ముందు నిలబడి, వాష్‌బేసిన్ గిన్నెలు తొలుస్తూ తన ప్రతిబింబాన్ని చూసుకున్నాడు మంగళరావు. చాలా చాలా నెలల తర్వాత అలా చూసుకున్నాడు.

పుట్టుకతోనే రెండుగా చీలిన పైపెదవి (హేర్‌లిప్) పెదిమలకు మధ్య నుంచి బయటకి పొడుకుని వచ్చిన మూడు ఎత్తు పళ్లు. మొహంనిండా చిన్నప్పుడు వచ్చిన స్ఫోటకం మచ్చలు. ముందు సగభాగం బట్టతల. నుదుటి మీద నల్లగా కాల్చిన మచ్చ. చిన్నప్పుడు జ్వరంలో పోయిన కుడికన్ను.

కురూపి.

వికృతరూపుతను. తన మొహంలోకి చూడాలంటేనే రోతపుడుతుంది అందరికీ. కుడికాలికంటె ఎడంకాలు పెద్దదవటంవల్ల నడకలో కుంటితనం స్పష్టంగా కనిపిస్తుంది.

ఇలాంటి తనకి, అవమానాలతో, చీదరింపులతో, అవహేళలతో విసిగి వేసారిపోయిన తనకి ఇక్కడ క్రొత్త జీవితం? అంతా కలగావుంది.

"ఆయన వుత్త అనుమానం మనిషి." గూర్ఖా వారం రోజుల తర్వాత మంగళరావుకి చెప్పాడు. ఇంతకు మునుపు వుండే వంటవాడికీ, ఆ బంగారుబొమ్మకీ సంబంధం అంటగట్టి, వాడ్ని తన్ని తగిలేసాడు."